జనగామ
మంగళవారం 14 నవంబర్ 2023





వేదికపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బండా ప్రకాశ్, సిరికొండ మధుసూదనాచారి, వీ ప్రకాశ్



వేదికపై పాట పాడుతున్న మిట్టపల్లి సురేందర్

# టూరిస్టులు కావాల్నా ప్రజల్లో ఉండే పెద్ది కావాల్నా?

- పాకాల ఆయకట్టుకు ధోకా లేకుండ చేసిండు
- నర్సంపేట ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

## అభివృద్ధి కొనసాగాలంటే సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలె

వరంగల్, నవంబర్ 13 (నమస్తేతెలంగాణ) : ఆరు నూరైనా మళ్లీ ఎక్కువ సీట్లతో గెలిచి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపిస్తే నర్సంపేటకు లాభం జరుగుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. 'పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపించండి, మీకు కావాల్సిన పనులు చేసే బాధ్యత నాది' అని స్పష్టం చేశారు. పెద్ది అధ్యక్షతన సోమవారం నర్సంపేట శివారు నర్సాపురంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. సభకు హాజరైన ప్రజలను చూశాక ఇక్కడ పెద్ది భారీ మెజారిటీతో గెలిచిపోయాడని అర్థమవుతోందని, అరవై ఏండ్ల నాటి కల పాకాలకు గోదావరి నీళ్లను సాధించిండని చెప్పారు. పాకాలకు గోదావరి జలాల డిమాండ్‌ను గతంలో ఎవరూ తీర్చలేకపోయారని, ఎమ్మెల్యేగా పెద్ది ప్రజల కలను సాకారం చేశారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో గతంలో యాసంగి 30 నుంచి 35 వేల లోపు ఎకరాల్లో పంట పండితే ఇపుడు గోదావరి జలాలు వచ్చిన తర్వాత 1.35 లక్షల ఎకరాల్లో పంట పండుతోందని, పాకాల కింద పంటలకు ధోకా లేకుండా చేశాడన్నారు. పెద్ది కోరిక మేరకు ఎన్నికల తర్వాత పాకాల, రంగాయ చెరువుల కాలువలను బాగు చేసుకుందామని, నర్సంపేట పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు కూడా వేసుకుందామని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి గెలిచిన తర్వాత తాను ఇక్కడికొచ్చి నియోజకవర్గానికి కావల్సిన పనులు చేసే బాధ్యత తనదని తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌కు కూడా రాడని, వస్తే కారు అక్కడ ఆగదని, తెల్లారేసరికే నర్సంపేటకు వస్తాడని చెప్పారు.



### పెద్ది అడిగితే మెడికల్ కాలేజీ

జిల్లా వైద్యశాలను నర్సంపేటకు తెచ్చింది సుదర్శన్‌రెడ్డేనని, వరంగల్ జిల్లా కోటాలోని మెడికల్ కాలేజీ నర్సంపేటలో పెట్టాలని పెద్ది అడిగితే మంజూరు చేశామని సీఎం చెప్పారు. దీంతో నర్సంపేటకు ప్రత్యేకత ఏర్పడిందని చెప్పారు. పదేళ్ల నుంచి నర్సంపేట ప్రశాంతంగా ఉందని వివరించారు. సమైక్యవాదులు వస్తమంటే నర్సంపేట ప్రజలు నిరసన తెలిపారని గుర్తుచేశారు. 'వైఎస్ షర్మిల డబ్బు కట్టలతో పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఓడిస్తదట, డబ్బు కట్టలు గెలువొద్దు 24 గంటల కరెంటు గెలువాలె.. పరాయి రాష్ట్రమోళ్లొచ్చి డబ్బు సంచులతో ఓడిద్దామంటే మనం ఓడిపోదామా? ఆలోచించాలె' అని ప్రజలను కోరారు. సుదర్శన్‌రెడ్డిని గత ఎన్నికల్లో గెలిపించి మంచి పనిచేశారని, ఆయన నాయకత్వంలో పనులు బాగా జరిగాయన్నారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాష్ట్ర జలవనరుల సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఎంపీలు మాలోత్ కవిత, దయాకర్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ ఎంపీ సీతరాంనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీ కిషన్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, జడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, రాయిడి రవీందర్‌రెడ్డి, నల్లా మనోహర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీపీలు వేములపల్లి ప్రకాశ్‌రావు, ఊడుగుల సునీత, రమేశ్, కాట్ల కోమల, జడ్పీటీసీలు పత్తినాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ సభలో గులాబీ జెండాతో..




## కాంగ్రెస్‌కు విజన్ లేదు

### బీఆర్ఎస్ నర్సంపేట అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, నవంబర్ 13: అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులకు విజన్ లేదని, వారి చేతిలో నర్సంపేట అభివృద్ధి చెందదని నర్సంపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తనను ఓడించేందుకు ప్రతి ఎన్నికల్లో ఒక్కటవుతున్నారన్నారు. ఈ నాయకులు ఎన్నికలు రాగానే నియోజకవర్గానికి వస్తున్నారని, ఎన్నికల తర్వాత ప్రజలకు కనిపించకుండా పోతున్నారని దుయ్యబట్టారు. కరోనా సమయంలోనూ ఈ నాయకులు ఇంటికి తాళం వేసుకొని లోపల ఉన్నారని, ప్రజలు ఆపదలో ఉంటే పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఇద్దరు నాయకులకు అభివృద్ధిపై ప్రణాళిక లేదన్నారు. తనకు వాటాలు, కోటాలు లేవని, తాను రౌడీని కాదని, ప్రజల మధ్యే ఉంటున్నానని చెప్పారు. ప్రజలతోనే ఎక్కువ కాలం ఉన్నానని, నర్సంపేటలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నానని, తాను హైదరాబాదో, హన్మకొండ నుంచో రావడం లేదని చెప్పారు. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ఒక్క టర్మ్‌లోనే ఎంతో అభివృద్ధి చేసి చూపించానని తెలిపారు. కరోనాతో ప్రజలు బాధ పడుతుంటే ప్రజల మధ్యే ఉంటూ ఐసొలేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి 1079 మందిని రక్షించినట్లు తెలిపారు. సొంత నిధులతో ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేయించానని గుర్తుచేశారు. ఎక్విప్‌మెంట్ కూడా సమకూర్చానని వివరించారు.తనకు కూడా మూడు సార్లు కరోనా వచ్చిందని గుర్తుచేశారు. నర్సంపేటలో మెడికల్ కళాశాల, జిల్లా వైద్యశాల, క్రిటికల్ కేర్ యూనిట్, హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్, డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశానని చెప్పారు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయని, తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తే వాటిని త్వరలోనే పూర్తి చేయిస్తానని చెప్పారు. రూ.180 కోట్లతో నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి చేశానని వివరించారు. ఉద్యమ కాలంలో నర్సంపేటలో తిరిగిన కేసీఆర్, ఇక్కడి ప్రజల జీవనస్థితిని చూశారని గుర్తుచేశారు. మళ్లీ తనను గెలిపించి కాంగ్రెస్ నాయకుల డ్రామాలను తిప్పికొట్టాలని ప్రజలను కోరారు.

### కంటి సమస్యే కారణం

ఉద్యమ కాలంలో వరంగల్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తనను పోలీసులు అరెస్టు చేయడం, వాటర్ క్యాన్లతో దాడులు చేయడం వల్ల తన ఒళ్లంతా హూనమైందని, ఒక కంటికి కూడా గాయమై కనిపించని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్లే ఎవరైనా నమస్తే పెడితే గుర్తించే పరిస్థితి ఉండడం లేదని, దీంతో ఎదుటివాళ్లు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. కంటి సమస్యతోనే ఇలా జరుగుతున్నదని, ఎక్కువ సేపు నిలబడినా, తిరిగినా కాళ్లు పనిచేయలేని పరిస్థితి ఉందని, ప్రజలు తనను తప్పుగా భావించదవద్దని కోరారు.



నర్సంపేట ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

# నర్సంపేట.. గులాబీ తోట..

## సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్దికి నీరా 'జనం'

- నియోజకవర్గ ఆశీర్వాద సభకు పోటెత్తిన ప్రజలు, అభిమానులు, గులాబీ శ్రేణులు
- ఆకట్టుకున్న 'మిట్టపల్లి' ఆటాపాట.. సభ సూపర్ సక్సెస్‌తో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

నర్సంపేట/నర్సంపేట రూరల్, నవంబర్13: నర్సంపేట గులాబీ తోటను తలపించింది. సోమవారం పట్టణంలోని సర్వాపురంలో నిర్వహించిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ మండలాల నుండి వేలాదిగా ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు తరలివచ్చి బీఆర్ఎస్‌కు మద్దతు పలికారు. సభా ప్రాంగణం నిండిపోవడంతో అక్కడి నుంచి 5, 6కిలో మీటర్ల దూరంలో వేలాది మంది రోడ్లపైనే ఉండిపోయారు. ప్రజలకు ఎక్కడా లోటు రాకుండా ఎమ్మెల్యే పెద్ది ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళలు, నాయకులు, కార్యకర్తలకు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అభిమానులు బీఆర్ఎస్ జెండాలతో 'జై తెలంగాణ.., జై కేసీఆర్.. జై బీఆర్ఎస్' అంటూ నినదిస్తూ ర్యాలీగా సభకు చేరుకున్నారు. వలంటీర్లు వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు అందించారు. దివ్యాంగులు సైతం తరలివచ్చి మద్దతు తెలిపారు.



బిల్డింగ్‌పై నుంచి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షిస్తున్న ప్రజలు

### కళాకారుల ధూంధాం

సభలో గాయకుడు మిట్టపల్లి సురేందర్ పాడిన పాటలు ఆలోచింపజేశాయి. ప్రజలు, నాయకులు సైతం గొంతు కలిపారు. జెండా, కండువా, తువ్వాలలు ఊపుతూ డ్యాన్స్ చేశారు. 'ధరణి వద్దంటున్న దద్దమ్మల్లారా.. రైతు బంధు వద్దనే రాబందుల్లారా.. దళిత బంధు వద్దనే దరిద్రుల్లారా పాపిష్టుల్లారా' అంటూ సురేందర్ పాడిన పాట ఆకట్టుకున్నది. 'కారు గుర్తుకు ఓటు వేయాలి.. కేసీఆర్ మళ్లీ రావాలి'.. 'గులాబీల జెండలే రామక' పాటలు సభలో మార్మోగాయి.



నర్సంపేట ప్రజా ఆశీర్వాద సభలో ఉత్సాహంతో నృత్యం చేస్తున్న యువకులు



జైకొడుతున్న మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, స్వప్న

### బీఆర్ఎస్‌లో జోష్

నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో నర్సంపేట బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కార్యకర్తలు పోటీ పడి పనిచేయాలని సీఎం సూచించడం వారిలో ఉత్సాహాన్ని నింపింది. తాను చెప్పిన విషయాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలని, చర్చల ద్వారానే ప్రజాస్వామ్య పరిణతి వస్తుందని సీఎం సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. కేసీఆర్ మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు, అభిమానులు జోష్‌తో ఊగిపోయారు. ఎమ్మెల్యే పెద్ది గురించి సీఎం వివరిస్తుండగా పెద్ద ఎత్తున శ్రేణులు హర్షధ్వానాలు చేశారు.



బైక్‌కు గులాబీ జెండాతో సభకు వస్తూ..



గులాబీ జెండాపై అభిమానంతో తలపాగా చుట్టుకున్న మహిళ

### ఆకట్టుకున్న రౌండ్ ఫ్లెక్సీలు..

సభలో ఏర్పాటు చేసిన రౌండ్ ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాంగణంలో 20కి పైగా రౌండ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో ఫ్యూఛర్ ఆఫ్ ఇండియా అని పేర్కొంటూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది ఫొటోలు, కారు గుర్తు ముద్రించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీ వద్ద జైకొడుతున్న దివ్యాంగులు